క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆదివారం ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పంపిణీ చేశారు. 20 మంది లబ్ధిదారులకు సుమారు రూ.6,45,500 విలువ గల చెక్కులను అందించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారు అనారోగ్యం పాలై వైద్యం చేయించుకున్న క్రమంలో సీఎం సహాయ నిధి నుంచి ఆర్థికసాయం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు వనమా గాంధీ, పర్సా వెంకటేశ్వరరావు, వీరబోయిన నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై వినతుల వెల్లువ

దమ్మపేట: మండలంలోని గండుగులపల్లి క్యాంపు కార్యాయలంలో స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు ఆదివారం సమస్యలతో కూడిన పలు వినతులు వెల్లువెత్తాయి. అశ్వారావుపేట నియోజకవర్గ నలుమూలల నుండి పలువురు ప్రజలు, ఎమ్మెల్యే జారేను మర్యాదపూర్వకంగా కలసి, తమ సమస్యలను విన్నవించుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత పరిష్కారయోగ్యమైన సమస్యలపై అధికారులతో ఫోన్‌లైన్‌లో మాట్లాడి, సత్వరమే పరిష్కరించాలని సూచించారు.

25, 26 తేదీల్లో మహాసభ

దుమ్ముగూడెం: అఖిల భారత ఐక్య రైతు సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా మండల కార్యదర్శి దాసరి సాయన్న పిలుపునిచ్చారు.ఆదివారం మండలంలోని గంగారం గ్రామంలో ఏఐయుకేఎస్ అఖిలభారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర మహాసభ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 25, 26 తేదీల్లో మహబూబాబాద్‌లో ప్రథమ మహాసభ జరుగుతుందని ఈ మహాసభకు దేశంలో ఉన్న ప్రాముఖ్య రైతు సంఘాల నాయకులు, ప్రముఖులు మేధావులు రాబోతున్నారని అన్నారు. ఈ నెల 25వ తేదీన మధ్యాహ్నం 12 గంటలకు రైతు మహా ప్రదర్శన బహిరంగ సభ ఉంటుందని ఈ బహిరంగ సభకి రైతులు ప్రజలు అందరూ రావాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు మోటో అర్జున్, రమేష్, సాయి, చిన్నయ్య, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మనగర్‌లో సీపీఎం పర్యటన

మణుగూరురూరల్: మండలంలోని ముత్యాలమ్మనగర్ గ్రామపంచాయతీలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం వారు ముత్యాలమ్మనగర్ పంచాయితీలో పర్యటించి ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంతోష్‌నగర్ ప్రాంతంలోని సీటైప్ కాలనీ ఎదురుగా గల ఐతనకుంట చెరువును పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఐతనకుంటకు ఆనుకుని సుమారు 150 కుటుంబాల వారు ఇండ్లను నిర్మించుకుని జీవనం సాగిస్తున్నారని, భారీ వర్షాలకు వరద తాకిడికి వారి ఇళ్లు కూలిపోయే ప్రమాదం ఉందన్నారు. అలాగే వరద ప్రవాహానికి చెరువుకట్ట ప్రమాదం పొంచి ఉందన్నారు. చెరువులో వ్యర్థాలు వేయడం ద్వారా పేరుకుపోయి కలుషితమవుతోందన్నారు. అధికారులు వెంటనే స్పందించి ఐతనకుంట ప్రాంతాన్ని ఆక్రమిస్తూ నిర్మించిన ఇళ్లను తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు దామల్ల వెంకన్న, బొల్లం రాజు, తోట పద్మ, పల్లపు నాగేశ్వరరావు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వరినాట్లు

- వర్షాలతో ఊపందుకున్న సాగు
- కూలీలకు పెరిగిన డిమాండ్
- 22 వేల ఎకరాల్లో వరి



నాగలితో గొర్రు చేస్తున్న రైతు



ములకపాడులో నాటు వేస్తున్న కూలీలు

దుమ్ముగూడెం: గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని రైతులు ముమ్మరంగా వరి నాట్లు వేస్తున్నారు. సీజన్ ఆరంభం నుంచి నెల రోజులకు పైగా వర్షాలు సక్రమంగా లేక నారుమళ్లు ఎండిపోయే దశకు చేరుకున్నాయి. ప్రస్తుతం కురిసిన వర్షాలకు మండలంలో జోరుగా వరినాట్లు సాగుతున్నాయి. మండలంలో కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లోని చెరువులలోకి సైతం నీరు చేరడంతో రైతులు ధైర్యంగా పనులు మొదలు పెట్టారు. మండల వ్యాప్తంగా 22వేల ఎకరాలలో వరి సాగు అవుతుందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు.

ఇతర నీటి వనరుకూ అవకాశం

ఈ ఏడాది వేసవిలో విరివిగా కురిసిన వర్షాలు వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడంతోనే వెనకబడటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందారు. నారు మళ్లు కూడా ఎండిపోయే దశకు వచ్చాయి. ఈ నేపథ్యంలో గత కొన్ని రోజులుగా అడపదడపా వర్షాలు కురుస్తున్నాయి. దీనికితోడు తాలిపేరు కాలువ నీరు, గోదావరి వైపు మోటార్లు పెట్టి నీరు తోడే అవకాశం, ప్రగళ్లపల్లి లిఫ్ట్ కాలువ నీరు వచ్చే అవకాశాలు ఉండటంతో రైతులు ఆ దిశగా పనులను ప్రారంభించుకున్నారు.

ఎకరానికి రూ.5వేలు కాంట్రాక్ట్..

వ్యవసాయ పనులు షురూ కావడంతో కూలీలకు డిమాండ్ సైతం పెరిగింది. దీంతో ఎకరానికి రూ.5వేల నుండి 5,500 వరకు కాంట్రాక్ట్ పద్ధతిలో కూలీలు నాట్లు వేస్తున్నారు. ఎక్కడ చూసిన గ్రామాల్లో వ్యవసాయ కూలీలు రైతులు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. దీంతో కూలీలకు డిమాండ్ పెరిగింది. మహిళలకు రోజుకు రూ.400, పురుషులకు రూ.500 ఇచ్చి తీసుకెళ్తున్నారు. దీంతో ఇతర గ్రామాల నుంచి వరినాట్లు వేసేందుకు కూలీలు సిద్ధమవడంతో.. రైతులు ఆటోల్లో, ఇతర ప్రైవేట్ వాహనాల్లో వారిని తీసుకువస్తున్నారు. కూలితో పాటు ప్రయాణ ఖర్చులు భరించాల్సి వస్తుండటంతో సాగు ఖర్చులు మరింత పెరిగినట్లు రైతులు చెబుతున్నారు.

ఏడు ఎకరాల్లో నాటు వేశాను..



ప్రగళ్లపల్లి లిఫ్ట్ కాలువ కింద 7ఎకరాల వరి సాగు చేస్తున్నాను. నారు ముదిరినప్పటికీ ఆశాజనకంగానే ఉంటుందనుకుంటున్నాను. వర్షాలు వెనకబడటంతో కొంత ఆందోళన చెందాం. కాని కాలువ నీరు వస్తుందనే ధైర్యంతో కూలీలకు కాంట్రాక్ట్ పద్ధతిలో అప్పగించి నాట్లు పూర్తి చేశాను.

– కాకిబోయిన సతీష్, రైతు, బండిరేవు

ఇబ్బందులు ఉండకపోవచ్చు..



ప్రస్తుతం 5 ఎకరాల వరి సాగు చేస్తున్నాను. గతంలో ఈ పాటికి గోదావరి వరదలు వచ్చి పొలాలు మునిగి రైతులు ఇబ్బంది పడ్డారు. ప్రస్తుతం వర్షాలు వెనకబడ్డప్పటికీ ఆందోళన చెందాల్సిన అవసరం లేదనుకుంటున్నా. వచ్చే రెండు నెలలు కూడా పరిస్థితి ఇలాగే ఉంటే రైతులు బయటపడ్డట్టే

– తాటిపూడి రమేష్, వర్క్‌షాప్ రైతు

వెదజల్లే పద్ధతితో మేలు



వర్షాలు ఇంకా పూర్తి స్థాయిలో పడని నేపథ్యంలో రైతులు ఆచితూచి వ్యవహరించాలి. రైతులకు వెదజల్లే పద్ధతితో ఎంతో మేలు కలుగుతుంది. ఖర్చు ఆదా అవడంతోపాటు దిగుబడి కూడా ఎక్కువగా వస్తుంది. మండలంలో అంచనాలకు తగ్గట్టుగానే వరి సాగయ్యే అవకాశం ఉందన్నారు.

– నవీన్‌కుమార్, మండల వ్యవసాయాధికారి

అయోధ్యకు పలువురి నివాళి

మణుగూరుటౌన్: పోరాటాలకు, ప్రజా ఉద్యమాలకు పినపాక నియోజకవర్గంతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా నిఖార్సైన నేతగా అయోధ్య పేరు తెచ్చుకున్నాడని పలు పార్టీల నాయకులు అభివర్ణించారు. సీపీఐ సీనియర్ నేత అయోధ్య సంతాప సభను ఆదివారం అశోక్‌నగర్‌లోని కిన్నెర కల్యాణ మండపంలో ఏర్పాటు చేయగా.. పార్టీలకతీతంగా పలువురు నాయకులు హాజరై నివాళులర్పించారు. సీపీఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుతో పాటు డీసీసీబీ డైరెక్టర్, కాంగ్రెస్ నాయకులు తుళ్లూరి బ్రహ్మయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషాలు మాట్లాడుతూ.. అయోధ్యతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుని ఉద్వేగానికి లోనయ్యారు. పినపాక నియోజకవర్గంలో సీపీఐకి పెద్దన్నగా ఉన్న అయోధ్య లేని లోటును పార్టీకి తీర్చలేనిదన్నారు. ఈ సంతాప సభకు వందలాది మంది అభిమానులు, కార్యకర్తలు హాజరుకాగా, సభకు సరెడ్డి పుల్లారెడ్డి అధ్యక్షత వహించారు.



సంతాప సభలో మాట్లాడుతున్న కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

కరకట్టను శుభ్రం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వంశీకృష్ణ

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గ్రామంలోని గోదావరి కరకట్టను శుభ్రం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు యలమంచి వంశీకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం గ్రామంలో జరిగిన పార్టీ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. దుమ్ముగూడెం కరకట్ట డంపింగ్ యార్డ్‌లాగా తయారయిందని దీనివల్ల రైతాంగం చాలామంది ఇబ్బంది పడుతున్నారని వెంటనే దీనిని బాగు చేయించాలని కోరారు. ఈ కరకట్ట మీదే కోళ్లు, చేపల వ్యర్థాలు మొత్తం తెచ్చిపోయటంతో వర్షాలకి అది మొత్తం కుళ్ళి అంటువ్యాధులు వచ్చే అవకాశం ఉందని అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న గ్రామ శాఖ కార్యదర్శికి శాఖ ఆధ్వర్యంలో రూ.10వేలు, రూ.2వేలు విలువ గల కిరాణా సామాన్లను యలమంచి శీను బాబు నాయకత్వంలో అందించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో హుస్సేన్, బైరెడ్డి సతీష్, బత్రి నరసింహారావు, ముసలి రాంబాబు, దల్లి వేణు, బాబురావు, కట్టుమూరు వేణు, కోరే రాము, రామిశెట్టి కనకరాజు సుత్తి రామకృష్ణ, వేముల వెంకటేశ్వరరావు, నూక రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు 'ముత్యాలమ్మ తాంబూలం'

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో శ్రావణమాసం చివరి మంగళవారం ముత్యాలమ్మ తాంబూలం అందజేయనున్నారు. ప్రతీ ఏడాది లాగానే ఈ ఏడాది శ్రావణమాసం చివరి మంగళవారం ఆలయానికి వచ్చే మహిళ భక్తులకు అమ్మవారి పసుపు, కుంకుమ, జాకెట్, గాజులను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అందచేయనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి తాంబూలం స్వీకరించాలని కోరారు.

రేగా పరామర్శ

అశ్వాపురం: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు జాలె రామకృష్ణారెడ్డిని ఆదివారం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు పరామర్శించారు. మల్లెలమడుగు గ్రామంలో కొండా తిరుపతయ్య అల్లుడు క్రాంతికి కాలు విరగడంతో ఆయనను రేగా పరామర్శించారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడి అమరేందర్, మత్రి మల్లారెడ్డి, మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయండి

చంద్రుగొండ: ఈనెల 21న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండల పర్యటన నేపథ్యంలో పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన బెండాలపాడు గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, దామరచర్ల గ్రామంలో బహిరంగసభ నిర్వహించే ప్రదేశం, చంద్రుగొండలో హెలిప్యాడ్ నిర్మాణ పనులను పరిశీలించారు. చంద్రుగొండ నుండి బెండాలపాడు వరకూ బీటీ రోడ్డు మరమ్మతు పనులను శరవేగంగా పూర్తి చేయాలన్నారు. విద్యుత్, తాగునీరు, వైద్య సదుపాయాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. మురుగు కాలువలు శుభ్రం చేయించాలని పీఆర్‌డీఈ సైదులురెడ్డిని ఆదేశించారు. పనుల నిర్వహణలో ఎలాంటి జాప్యం చేయొద్దని సూచించారు. నేడు రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తారని, అనంతరం జిల్లాస్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వెంట జిల్లా గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు, మండల నాయకులు భోజ్యా నాయక్, సారెపల్లి శేఖర్, ఫజల్ భక్ష్, బొర్రా సురేశ్ ఉన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

ఉద్యోగ భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్

అశ్వారావుపేటరూరల్: గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న ప్రతి కార్మికుడికీ ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాన్ని రూ.26వేలకు పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని వినాయకపురం గ్రామంలో సీఐటీయూ మూడొవ మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు మాట్లాడుతూ.. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, బీమా కల్పించడంతోపాటు అర్హత ఉన్న వారికి బిల్ కలెక్టర్‌లుగా అవకాశం ఇవ్వాలని కోరారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లను కార్మికులకు మంజూరు చేయాలని వినతి చేశారు. అనంతరం మండల కమిటీను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలో మండల అధ్యక్షుడిగా యాదగిరి వెంకటప్పయ్య, మండల ప్రధాన కార్యదర్శిగా కొడిమి వినోద్, సహాయ కార్యదర్శిగా కొనకళ్ల మహేష్, కోశాధికారిగా వేల్పుల ముత్తారావుతోపాటు కమిటీ సభ్యులుగా మరికొంతమందిని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో నాయకులు కేసుపాక నరసింహారావు, చందా రామారావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికపై విచారణ జరిపించండి

చంద్రుగొండ: గడిచిన ఏడాది జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.వెంకటేశ్వరరావు, బి.రవి డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే జారె ఆదినారాయణను ఆదివారం చంద్రుగొండలో కలసి, వినతిపత్రం అందజేశారు. ఆ ఎన్నికలో డబ్బు, మద్యం పంపిణీ చేసినట్లు ఆరోపణలున్నాయన్నారు. ఎన్నికలను అడ్డుగా పెట్టుకొని ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని, ప్రజాస్వామ్య విలువలను మంటకలిపారని విమర్శించారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని వారు ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు వై.సంఘమేశ్వరరావు, ఎండి.ఆరిఫ్ హుస్సేన్, ఎస్‌కె.జహంగీర్ షరీఫ్, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఏ.లక్ష్మణ్, ఎన్.వెంకటేశ్వర్లు, డి.రమేశ్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు జారెకు వినతిపత్రం అందజేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

ముత్యాలమ్మకు మొక్కులు



ములకలపల్లి: ముత్యాలమ్మ ఆలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

ములకలపల్లి: శ్రావణమాసం ఆఖరి ఆదివారం నేపథ్యంలో ముత్యాలమ్మ తల్లి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. మండలవ్యాప్తంగా గ్రామాల్లో వెలసిన తల్లులకు మొక్కులు చెల్లించుకున్నారు. మండలకేంద్రంలో తొలుత భక్త అభయాంజనేయ స్వామి ఆలయంలోనూ. సమీపంలోని బొడ్రాయి వద్ద పూజలు చేశారు. మహిళలు నెత్తిన బోనాలతో గ్రామశివారులోని తల్లి చెంతకు చేరుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి, చీరె, సారె సమర్పించుకున్నారు. కోళ్లు, మేకలు కోసి, మొక్కులు తీర్చుకున్నారు.

భక్తుల పూజలు..

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం గ్రామంలో ఉన్న చిలకలగండి ముత్యాలమ్మ తల్లి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచే భక్తులు వివిధ ప్రాంతాల నుంచి ఆలయానికి తరలిరాగా.. అమ్మవారిని దర్శించుకొని నైవేద్యాలు సమర్పించారు. అలాగే అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని అన్నసమారాధన కార్యక్రమాలను నిర్వహించారు.

రహదారికి మోక్షమెన్నడో..?

- రెండున్నర ఏళ్ల క్రితం ఎలకలగూడెం–మనుబోతులగూడెం రోడ్డు శంకుస్థాపన
- అటవీ అనుమతులు లేక ప్రారంభం కాని పనులు



మనుబోతులగూడెం రహదారి

అశ్వాపురం: మండల పరిధిలోని గొందిగూడెం–ఎలకలగూడెం, వేములూరు–మనుబోతులగూడెం రహదారికి మోక్షం కలగడం లేదు. ఎన్నో ఏళ్లుగా కనీస రహదారి సౌకర్యం లేక వేములూరు, మనుబోతులగూడెం గ్రామాల గిరిజనులు అవస్థలు పడుతున్నారు. వర్షాలకు వాగులు పొంగితే వారి అవస్థలు వర్ణణాతీతం. గిరిజనులు, ఆదివాసీలు అనారోగ్యానికి గురైతే కనీసం అంబులెన్స్ కూడా వచ్చే పరిస్థితి లేదు. డోలి కట్టి మోసిన సంఘటనలు కూడా ఉన్నాయి.

ఏళ్ల క్రితమే శంకుస్థాపన..

గత ప్రభుత్వంలో ట్రైబల్ సబ్‌ప్లాన్‌లో ఎస్‌టీఎస్‌డీఎఫ్ నిధుల నుంచి గొందిగూడెం నుంచి ఎలకలగూడెం రహదారికి రూ.2 కోట్లు, ఎలకలగూడెం నుంచి మనుబోతులగూడెం రహదారికి రూ.10 కోట్లు మంజూరు అయ్యాయి. రహదారి పనులకు 21 ఫిబ్రవరి 2023న అప్పటి ఎమ్మెల్యే రేగా కాంతారావు శంకుస్థాపన చేశారు. ఎలకలగూడెం రహదారి పనులు ప్రారంభించి ఎర్త్‌వర్క్‌చేసి గ్రావెల్ పోశారు. బీటీ రోడ్డు వేయాల్సి ఉండగా.. అంతలోనే పనులు నిలిపివేశారు. అనంతరం ఎన్నికలు రావడం ప్రభుత్వం మారడంతో రహదారి పనులు వెనుకబడ్డాయి. బిల్లులు కావడం లేదని పనులను కాంట్రాక్టర్ నిలిపివేశారు.

అటవీ అనుమతులు లేకనే..

వేములూరు నుంచి మనుబోతులగూడెం వరకు రహదారి నిర్మాణానికి అటవీ శాఖ అనుమతులు కావాల్సి ఉంది. వేములూరు, మనుబోతులగూడెం గ్రామాలు దట్టమైన అటవీ ప్రాంతంలో ఉండటంతో అటవీ శాఖ అనుమతులు లేక రహదారి పనులు నిలిచిపోయాయి. రహదారితో పాటు మార్గ మధ్యలో 2 భారీ వంతెనలు, 2 స్లాబ్ కల్వర్టులు, 15 కల్వర్టులు నిర్మించాల్సి ఉంది. రహదారి నిర్మాణానికి 1 హెక్టార్ వరకు జిల్లా కలెక్టర్ స్థాయిలో అటవీ అనుమతులకు సంబంధించి ఐటీడీఏ పీఓ ద్వారా అటవీ అనుమతుల కోసం ఫారెస్ట్ అధికారులకు పంపగా.. వారు తిరస్కరించినట్లు సమాచారం. మరలా అనుమతుల కోసం అధికారులు అటవీ శాఖకు నివేదించారు. ప్రస్తుతం రహదారి సౌకర్యం లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా ఈ తిప్పలు తప్పడం లేదు. జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ ప్రత్యేక చొరవ చూపి రహదారి నిర్మాణానికి అటవీ అనుమతుల కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని గిరిజనులు కోరుతున్నారు.

రహదారి నిర్మించాలి..



కనీస రహదారి సౌకర్యం లేక ఎన్నో ఏళ్లుగా ఇబ్బంది పడుతున్నాం. మాజీ ఎమ్మెల్యే ఎమ్మెల్యే రేగా కాంతారావు ప్రత్యేక చొరవ తీసుకొని రహదారికి రూ.10 కోట్లు మంజూరు చేయించారు. ఫారెస్ట్ వారి అనుమతులు లేక రహదారి పనులు చేపట్టడం లేదు. మా కష్టాలను చూసి అటవీ శాఖ వారు అనుమతులు ఇచ్చి రహదారి నిర్మాణం వెంటనే చేపట్టాలి.

– స్వరూప, మాజీ సర్పంచ్, మనుబోతులగూడెం

వంతెన నిర్మాణంలో జాప్యమేలా?

- రెండు చోట్ల ప్రారంభంకాని పనులు
- శంకుస్థాపనలు చేసి తొమ్మిది నెలలు
- ఈ ఏడాది రాకపోకలకు తప్పని తిప్పలు



కేశప్పగూడెం–మద్దికొండ మధ్య వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి, ఎంపీ (ఫైల్)



ములకలపల్లి మండలం కొత్తూరు వద్ద హైలెవల్ వంతెన నిర్మించాల్సిన ప్రదేశం ఇదే..

అశ్వారావుపేటరూరల్: నియోజకవర్గంలోని రెండు వాగులపై హైలెవల్ వంతెనలు నిర్మించేందుకు శంకుస్థాపనలు చేసి నెలలు గడుస్తున్న నేటికీ నిర్మాణాలకు నోచుకోవడం లేదు. ఏటా వానాకాలం సీజన్‌లో వాహనదారులు, రైతులు వాగులు దాటేందుకు తిప్పలు పడుతున్న నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే వాగులపై వంతెన నిర్మాణాలకు నిధులు మంజూరు చేయించారు. కానీ వంతెనల నిర్మాణాల పనులు మాత్రం నేటికి ఊసేలేవు.

అశ్వారావుపేట మండలంలోని కేశప్పగూడెం-మద్దికొండ గ్రామాల మధ్య ఉన్న వాగుపై దాదాపు ఇరవై ఏళ్ల క్రితం లోలెవల్ చప్టాను నిర్మించగా.. జోరు వర్షాలకు వరద పొంగి లోలెవల్ చప్టా నీట మునిగిపోతుంది. దీంతో పలు గిరిజన గ్రామాలకు, చుట్టూ పక్కల రైతులకు తీరని ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ మార్గంలో గిరిజన గ్రామాలతోపాటు, రైతుల పంట పొలాలు, పామాయిల్, కొబ్బరి తోటలు అధికంగా ఉంటాయి. దీంతో వర్షాకాలంలో తమ పంట ఉత్పత్తులను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. అలాగే ఈ రెండు గ్రామాల మధ్య వానాకాలం వస్తే రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. ఈ సమస్యను కొద్ది నెలల క్రితం స్థానిక రైతులు, గ్రామస్తులు కలిసి స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పంచాయతీ రాజ్ శాఖ ద్వారా హైలెవల్ వంతెన మంజూరు చేయించారు.

శంకుస్థాపన చేసి తొమ్మిది నెలలు..

అశ్వారావుపేట మండలంలోని కేశప్పగూడెం–మద్దికొండ గ్రామాల మధ్యలో హైలెవల్ వంతెన నిర్మాణానికి పీఎంజీఎస్‌వై కింద రూ.3కోట్ల65లక్షల రూపాయాల నిధులు మంజూరు కాగా.. గతేడాది డిసెంబర్26వ తేదీన రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డితో ఎమ్మెల్యే శంకుస్థాపన చేయించారు. అదే రోజున ములకలపల్లి మండలంలోని కొత్తూరు గ్రామ సమీపంలో కుడా హైలెవల్ వంతెన నిర్మాణానికి మంత్రి, ఎంపీ చేతులు మీదుగా శంకుస్థాపన చేశారు. ఈ వంతెన నిర్మాణానికి పంచాయతీ రాజ్ శాఖ ద్వారా రూ.1.60 కోట్ల నిధులు కేటాయించారు. కానీ శంకుస్థాపన తర్వాత నిర్మాణ పనులు మాత్రం నేటికి మొదలు కాలేదు. ఆయా శంకుస్థాపనలు చేసి తొమ్మిది నెలలు గడుస్తున్న నేటికీ హైలెవల్ వంతెనల నిర్మాణ పనులు మాత్రం మొదలు కాలేదు. దీంతో ఆయా గ్రామాల మధ్య కుడా వర్షం కురిస్తే లోలెవల్ చప్టాలు నీట మునిగి రాకపోకలు నిలిచి పోతున్నాయి. ఈ నేపథ్యంలో వచ్చే ఏడాది వానాకాలం సీజన్ లోనైనా ఈ వంతెనల వద్ద కష్టాలు తప్పుతాయా? లేదా?అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారుల, పాలకులు పట్టించుకోని వాగులపై వంతెనల నిర్మాణాలను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

త్వరలోనే వంతెన నిర్మాణం

హైలెవల్ వంతెనల నిర్మాణాల పనులు ఇంకా మొదలు కానీ మాట వాస్తవమే. ఆయా పనులు టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లకు ఇతర చోట్ల పనులు ఉండటంతో, వంతెన నిర్మాణాలు ఆలస్యమయ్యాయి. వచ్చే రెండు నెలల్లో కేశప్పగూడెం–మద్దికొండ మధ్యలో వంతెన నిర్మాణాన్ని ప్రారంభిస్తాం. వచ్చే వర్షాకాలం సీజన్ నాటికి నిర్మాణాన్ని పూర్తి చేసేలా కృషి చేస్తా.

– అక్షిత, ఏఈఈ, పీఆర్, అశ్వారావుపేట